# పంట ఎండి.. గుండె మండిన రైతన్న

'నీ కాల్మొక్త సారూ..సాగునీళ్లు ఇయ్యుండ్రి'..
ఇది ధర్నాలో అడ్డుకున్న సీఐకి ఓ రైతు విజ్ఞప్తి.

'సావనైనా సస్తాం.. నీళ్లిచ్చేదాకా కదలం'...
ఇది వాహనాలకు అడ్డుపడ్డ మరో రైతు ఆవేదన.

కాంగ్రెస్ తెచ్చిన కరువుతో కండ్ల ముందే పంటలు ఎండుతుంటే అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. సాగునీళ్ల కోసం సర్కారుపై సమరం సాగిస్తున్నారు. రోజుకొక చోట రోడ్డెక్కుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు బోర్లు, ట్యాంకర్లు అద్దెకు తెచ్చుకుని అగచాట్లు పడుతున్నారు. పంటల పరిశీలనకు రాని ప్రభుత్వంపై ఆక్రోశం వెల్లగక్కుతూనే.. రైతులను వెతుక్కుంటూ వచ్చిన గులాబీ నాయకులను గుండెలకత్తుకుని గోడు చెప్పుకుంటున్నారు. - నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్







## నీళ్లిచ్చేదాకా కదలం

నీళ్లు లేక పంటలు చేతికందే దశలో ఎండిపోతున్నాయని, వెంటనే చివరి ఆయకట్టుకు సాగునీళ్లు ఇవ్వాలని మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని పోచమ్మవాడ, మల్లేపల్లికి చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి తండ్లాట మొదలైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటు కన్నాల ప్రాజెక్టు నీరు అందక, అటు ఎస్సారెస్పీ, గుండారం రాక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని వాపోయారు. పంటలకు సరిపడా సాగునీరు అందిస్తామని చెప్తేనే తాము పంటలు సాగుచేశామని, తీరా ఇప్పుడు సాగునీరు ఇవ్వకపోతే తాము అప్పుల పాలై రోడ్ల మీద పడాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీళ్లిచ్చే వరకూ ధర్నాను విరమించేది లేదని పట్టుబట్టారు. -మంథని

## 'మేడిపల్లి' హామీ.. మేడిపండేనా?



పంటలు చేతికందే దశలో నీరు లేక ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు మంగళవారం కరీంనగర్–జగిత్యాల రహదారిలో కొండన్నపల్లి–కురిక్యాల మధ్య వరదకాలువ బ్రిడ్జిపై రాస్తారోకో చేశారు. మూడు రోజుల క్రితం సాగునీటి కోసం తాము ధర్నా చేయడానికి ప్రయత్నిస్తే నీటిని విడుదల చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారని, దీంతో తాము ధర్నా విరమించామని గుర్తు చేశారు. మూడు రోజులు గడుస్తున్నా.. నీరు విడుదల చేయకపోవడంతో మళ్లీ ఆందోళనకు దిగామని, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. -గంగాధర

## గిదేంది పటేలా..!

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల రైతు కట్కూరు మల్లేశం తన ఏడెకరాల పొలంలో వరిపంట సాగుచేశాడు. నీళ్లు లేక పంట మొత్తం ఎండిపోయింది. దీనిని చూసి కన్నీటిపర్యంతమైన ఆ రైతు.. తన బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియక.. ఓ వీడియోలో సీఎం రేవంత్‌రెడ్డికి తన గోడును వెల్లబోసుకున్నాడు. 'అయ్యా.. రేవంత్‌రెడ్డి పటేలా.. మీ పటేండ్ల పాలనలో పొలాలు ఎండుతున్నయి. నాకున్న ఎడెకరాల పొలంలో అంతా నాటేసిన. ఇప్పుడు నీవు నీళ్లియ్యకపోతివి.. నా పొలం ఎండిపోవట్టే.. రైతుబంధు ఇయ్యకపోతివి.. రుణమాఫీ చేయకపోతివి.. ఎప్పుడు చేస్తవు పటేలా? మీ.. పాలన గిట్లుంది. ఏంది? రైతులం ఉండాల్నా.. సావాల్నా? ఇగో వరి చూడు.. మా కేసీఆర్ ఉన్నప్పుడు పుల్లు నీళ్లు వచ్చేవి. పుల్లుపుల్లుగా పొలాలు పారేది' అంటూ తన వరి పొలాన్ని చూపిస్తూ ఆవేదన వెలిబుచ్చాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. - చేర్యాల

## తూము ధ్వంసం

పెద్దపల్లి పట్టణ జీవధార ఎల్లమ్మ గుండమ్మ చెరువు (మినీ ట్యాంక్‌బండ్) తూమును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో రెండ్రోజులుగా నీరంతా వృథా పోతున్నది. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, సిబ్బంది మంగళవారం వచ్చి తూమును పరిశీలించి వెంటనే సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ ఘటనపై ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని, వారిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. -పెద్దపల్లి



## పట్టించుకోకుంటే ప్రజా ఉద్యమమే



పంటలెండిన రైతుల బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సచ్చిపోతున్నా కాంగ్రెస్ సర్కార్ స్పందించడం లేదని మండిపడ్డారు. అన్నమో రామచంద్రా.. అంటూ అర్థిస్తున్నా కనికరించడం లేదని ధ్వజమెత్తారు. రైతులను ఆదుకోకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలో ఎండిన పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుతో కలిసి పరిశీలించారు. బైక్‌పై పర్యటిస్తూ ఎండిన ప్రతి పంటనూ పరిశీలించి, ప్రతి రైతును కలిసి వారి బాధలను విన్నారు. - రాజన్నసిరిసిల్ల, నమస్తే తెలంగాణ

## రైతన్నకు కన్నీరు.. పొలాలకు ట్యాంకర్ నీరు

కాంగ్రెస్ పాలనలో అన్నదాతకు సాగునీటి కష్టం వచ్చింది. చేతికందే దశలో పంటలు కండ్లముందే ఎండిపోతుంటే.. వాటిని కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట రైతు కంటెరెడ్డి రెండెకరాల భూమి కౌలుకు తీసుకొని వరిసాగు చేశాడు. నీళ్లు రాక పంట ఎండిపోతుంటే.. చూడలేక ట్యాంకర్ల ద్వారా నీటిని పారిస్తున్నాడు. ఇప్పటికే పెట్టుబడికి రూ.1.50 లక్షలు వెచ్చించానని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటకు కావాల్సిన నీటిని కొనుగోలు చేసే దుర్భర స్థితి వచ్చిందని వాపోయాడు. - చందుర్తి



## ఎకరాకు 25వేలు ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. కాంగ్రెస్ వందరోజుల పాలనలో 180 మంది రైతుల ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని బట్టనవానికుంటలో ఎండిపోయిన వరి పొలాన్ని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నాగార్జున సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని వరి పొలాలు ఎండిపోయినట్టు ఆరోపించారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. - నేరేడుచర్ల

# 'బోరు'మంటున్న బత్తాయి రైతు

- సాగు నీళ్లు లేక ఎండుతున్న తోటలు
- వరి పంట ఎండితే ఒక సీజన్‌కే నష్టం..
- తోటలు ఎండితే ఐదారేండ్ల దిగుబడి బుగ్గిపాలు
- ఒక్కో రైతు పదుల సంఖ్యలో బోర్ల తవ్వకం
- బోర్లలో లక్షలు పోసినా చుక్కనీళ్లు రాకపాయె

నల్లగొండ ప్రతినిధి, మార్చి26(నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసి తాగునీటితోపాటు సాగునీటి అవసరాలు తీర్చేదే ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ). హైదరాబాద్ జంటనగరాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తాగునీటి సరఫరాతోపాటు మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తూ జిల్లా ప్రజలకు గుండెకాయలా ఉంటున్నది. ఇలాంటి ప్రాజెక్టు పరిధిలో ఈ సీజన్‌లో పూర్తిస్థాయిలో కరువుఛాయలు నెలకొన్నాయి. సాగర్‌కు ఈసారి సరైన వరద రాకపోవడం వల్ల ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగునీటి విడుదల జరుగలేదు. యాసంగిలో ఒక్కసారి కూడా ప్రధాన కాల్వ ద్వారా చెరువులు, కుంటలను నింపలేదు. ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలో రైతులు వరి కంటే కూడా ఎక్కువగా బత్తాయి, నిమ్మ వంటి తోటలు సాగు చేస్తారు. వరి పంట ఎండిపోతే ఈ సీజన్ వరకే నష్టం జరుగుతుంది. కానీ తోటలు ఎండిపోతే ఐదారేండ్ల దిగుబడితోపాటు ఇన్నాళ్లూ పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం వృథా అవుతుంది. రైతులకు కోలుకోలేని దెబ్బతినాల్సి వస్తుంది. ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగర్ నుంచి నీళ్లు విడుదల కాకపోవడంతో డిసెంబర్ నాటికే అత్యధిక చెరువులు, కుంటలు వట్టిపోయాయి. బోర్లు, బావుల్లోనూ నీటిమట్టాలు పాతాళంలోకి వెళ్లడంతో వరితోపాటు తోటలకు నీటిఎద్దడి నెలకొంది. వరి పంటను దాదాపుగా కోల్పోగా తోటలను కాపాడుకోవడానికి రైతులు ట్యాంకర్లు, బోర్లు అద్దెకు తీసుకుంటూ తీవ్రంగా శ్రమిస్తున్నారు.

### ఎక్కడ చూసినా.. ఎండిన బోర్లే

ఈ సీజన్‌లో మొత్తం 1.80 లక్షల ఎకరాల్లో వరితోపాటు కూరగాయలు, ఇతర పంటలు సాగైనట్టు అంచనా. ఇవి కాకుండా మరో 65 వేల ఎకరాల వరకు పండ్ల తోటలు విస్తరించి ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం లక్షన్నర ఎకరాల పంటలకు నీటి ఎద్దడి నెలకొన్నది. ఇప్పటికే 75వేల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయినట్టు అంచనా. నల్లగొండ జిల్లాలోని 13 మండలాల పరిధిలో విస్తరించి ఉన్న ఏఎమ్మార్పీ ఆయకట్టులోని బావుల్లో చుక్క నీరు లేకపోగా బోర్లు వట్టిపోతున్నాయి. పది మంది రైతుల్లో కనీసం ఆరేడుగురు రైతులకు చెందిన ఒకటో, రెండో బోర్లు ఎండిపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాంతో సంక్రాంతి తర్వాత నుంచి బోర్ల తవ్వకాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కో ఊరిలో వందల బోర్లు వేశారు. పదెకరాలకు పైగా సాగుచేసే రైతు సగటున పదికి పైనే బోర్లు వేసినట్లు అంచనా. పండ్ల తోటలు ఎక్కువగా ఉన్న పల్లెల్లో పగలు, రాత్రి తేడా లేకుండా బోరుబండ్ల శబ్దాలు హోరెత్తుతున్నాయి. పంట పొలాల్లో ఎక్కడ చూసినా నీళ్లు రాక వదిలేసిన బోరు గుంతలే ప్రత్యక్షమవుతున్నాయి. డీ–5 నుంచి డీ–55 వరకు ఉన్న హైలెవల్‌తోపాటు లోలెవల్ కాల్వల కింద దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు 300–400 ఫీట్లలోతు బోర్లు వేసినప్పటికీ ఫలితం ఉండడం లేదు. వచ్చే ఏప్రిల్, మే నెలలను ఊహించుకుంటేనే అన్నదాతల కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. నేటి పరిస్థితులు చూస్తే 20 ఏండ్ల కిందట పరిస్థితులు కండ్ల ముందు మొదలాడుతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.



కనగల్ మండలం పర్వతగిరిలో నీళ్లు లేక ఎండిపోతున్న బత్తాయి తోట



### రెండు నెలల్లో 32 బోర్ల తవ్వకం

నీళ్లు పడని ఈ బోరును చూపిస్తున్న ఈ రైతు పేరు కుందూరు రాఘవరెడ్డి. ఊరు ఏఎమ్మార్పీ పరిధిలోని డీ-37 ప్రధాన కాల్వ ఏరియాలోని తిప్పర్తి మండలం జొన్నగడ్డలగూడెం. 20 ఎకరాల్లో బత్తాయి, నిమ్మ తోటలు, 3 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. పదేండ్లుగా ఐదు బోర్లతో సమృద్ధిగా పంటలకు నీరందిస్తున్నాడు. డిసెంబర్ నుంచి నీటి కష్టాలు మొదలయ్యాయి. కండ్ల ముందే ఎండుతున్న చేనును కాపాడుకునేందుకు రాఘవరెడ్డి బోర్లు వేయడం మొదలుపెట్టాడు. ఒకదాని మీద ఒకటి చొప్పున మొత్తం 32 బోర్లు వేశాడు. రెండు నెలల కాలంలో 20 ఎకరాల్లో అన్నివైపులా నీటి కోసం శోధించాడు. సుమారు రూ. 10 లక్షలు బోర్ల పేరుతో భూమిలో పోశాడు. అయినా తోటలకు సరిపడా నీళ్లు రాలేదు. ఇది ఒక్క రాఘవరెడ్డి బాధే కాదు. ఏఎమ్మార్పీ పరిధిలోని మెజార్టీ పండ్ల తోటల రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. వారంతా నీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి ఉపశమన చర్యలూ లేకపోవడం రైతులను మరింత కుంగదీస్తున్నది.

### ఏడు బోర్లు వేసిన.. చుక్కనీళ్లు రాలే!




మాది ముషంపల్లి గ్రామం. రెండు దశాబ్దాల తరువాత మా ఊరికి కరువొచ్చింది. 20 ఎకరాల్లో బత్తాయి తోట, మరో 15 ఎకరాలలో వరి పొలం పెట్టిన. మరో ఐదు ఏకరాలు కౌలు తీసుకుని వరి ఏసిన. నా పంటల సాగుకు పది బోర్లు ఉండేవి. యాసంగిలో మరో 7 బోర్లు వేశా. ఒక్కో బోరు 300 ఫీట్ల నుంచి 400 ఫీట్ల వరకు వేసినా చుక్క నీరు పడలే. దిక్కుతోచక నా పాత బోర్లనే కడిగించా. అప్పటికే వరి పంట 10 ఎకరాల మేర ఎండిపోయింది. ఇక బత్తాయి తోట ఎండిపోతుందనే భయంతో నిద్రపడుతలేదు. ట్యాంకర్ల తోటి నీటిని తెచ్చి బత్తాయి మొక్కలను కాపాడుకుంటున్న. - బైరెడ్డి అనంతరెడ్డి, ముషంపల్లి, నల్లగొండ మండలం

### తాగునీటి సరఫరాపై ఆందోళన వద్దు

సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉన్నదని, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేవని సీఎస్ శాంతికుమారి స్పష్టంచేశారు. సోమవారం రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగు



నీటి సమస్య తలెత్తకుండా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'కు నిధులు విడుదల చేశామని చెప్పారు. బోర్ల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులకు ఆదేశాలు ఇచ్చారు. క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో ప్రతిరోజూ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. జలాశయాల్లో నిరుడు మాదిరిగానే నీటి మట్టాలు ఉన్నాయని, అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కూడా రూపొందించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఏప్రిల్ రెండో వారం తర్వాత రిజర్వాయర్ల నుంచి ఎమర్జెన్సీ పంపింగ్‌ను చేపడతామని చెప్పారు.